క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


పీఆర్‌వో నాయుడుకు చెక్కు అందజేస్తున్న దాత భవానీదేవి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని కొత్తజాలరిపేటకు చెందిన దుర్గాంభిక భవానీదేవి రూ. లక్ష విరాళాన్ని సింహగిరిపై పీఆర్‌వో నాయుడుకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రం అందించి దర్శనం కల్పించారు.

ఘనంగా ప్రపంచ హిందీ దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న సంస్థ అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ అధికార భాష హిందీని రోజువారీ పనుల్లో గరిష్ఠంగా ఉపయోగించాలని సూచించారు. ఆపరేషన్ జీఎం డీపీ పాత్రో హిందీని గరిష్ఠంగా ఉపయోగిస్తామని సంస్థ ప్రధాన అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఆర్ ఏజీఎం రుమాడీ శర్మ హిందీ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ప్రపంచ హిందీ దినోత్సవంలో భాగంగా దీపిక లేడీస్ క్లబ్ సహకారంతో అంత్యాక్షరి పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆన్‌లైన్ హిందీ క్విజ్‌లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన


పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మహేష్

సింహాచలం : జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ దరి ఎస్‌బీసీ కాలనీ, శ్రమశక్తినగర్‌లో పైపులైన్ అభివృద్ధి పనులకు బుధవారం వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మెంటి మహేష్ శంకుస్థాపన చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో ఇటీవల ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేయడంతో నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ప్రాధాన్యత పనులను చేసేందుకు సంకల్పించారు. దీనిలో భాగంగా రెండు ఏరియాల్లో పైపులైన్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చకర్ల దరప, మెంటి సూరిబాబు, ముమ్మన మహాలక్ష్మినాయుడు, సూరిబాబు, సాంబమూర్తి రమణమూర్తి, చంద్రశేఖర్, ఏఈ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా


రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పరవాడ: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకురాలు సీహెచ్ దేవి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5లక్షలు చెల్లించాలని.. సూపర్‌వైజర్ పోస్టుల్లో వయోపరిమితి తొలగించాలన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు కుమారి, నీలిమ, శాంతి, వెంకట్, లక్ష్మి, స్వాతి, అరుణ, రామలక్ష్మి, ముత్యాలరాణి పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

సింహాచలం: పెందుర్తి బాలాజీ స్కూల్ , జూనియర్ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ సాంప్రదాయం ఉట్టిపడే విధంగా పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కళాశాల అధినేత కోట నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సింహగిరిపై వైభవంగా కూడారై ఉత్సవం


అప్పన్న ఉత్సవమూర్తులకు ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


గంగధార వద్ద గోదాదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా ఎదురు సన్నాహోత్సవం

సింహాచలం: సింహగిరిపై ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఈనెల 14న భోగిరోజు సాయంత్రం జరిగే గోదా రంగనాథుల కల్యాణోత్సవానికి సంబంధించి ఎదురు సన్నాహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గోదాదేవి ఉత్సవమూర్తిని ఆలయంలో తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అధిష్టంపజేసి విశేషంగా అభిషేకాలు చేశారు. అనంతరం అక్కడ అమ్మవారిని విశేషంగా అలకరించి పల్లకిలో ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద అధిష్టంపజేశారు. వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో తీసుకొచ్చి నీలాద్రిగుమ్మం వద్ద ఆస్థానమండపంలో వేంచేయజేశారు. ఎదురుసన్నాహోత్సవాన్ని వైభవంగా జరిపారు. అక్కడి నుంచి గోదాదేవిని, స్వామివారిని బేడాతిరువీధిగా తీసుకొచ్చి గోదాదేవి ఆలయంవద్ద అధిష్టంపజేశారు. విశేష పాశుర విన్నపం, సాత్తుమొరై, ధనుర్మాస పూజలు జరిపారు. ఈ సందర్భంగా అర్చకులు నృత్యాలు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పూజలు నిర్వహించారు.

వెంకటాద్రిపై ..

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై బుధవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి, వెంకన్నకు విశేషంగా పూజలు చేశారు. 27కిలోల వెన్నతో వెంకన్నకు నవనీత సేవ వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు సామూహికంగా ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలను నిర్వహించారు.

● శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై అధిష్టంప జేసి తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు పూజలు చేశారు.


వెంకటాద్రిపై కూడారై ఉత్సవంలో భాగంగా స్వామికి సమర్పించిన పాయసం

ఐక్యతతో కార్పొరేట్ సంస్థను తరిమికొట్టాం


ఎన్‌ఏడీ జి డబ్ల్యూ విభాగం కార్మికులతో మంత్రి రాజశేఖర్, మారయ్య

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపోలోకి దొడ్డిదారిన చొరబడేందుకు యత్నించిన కార్పొరేట్ సంస్థను తరిమి కొట్టడానికి నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్(ఎన్ఏఈఎస్ అండ్ డబ్ల్యూ) యూనియన్‌కు సహకరించిన కార్మికులకు ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అభినందనలు తెలిపారు. ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద మంగళవారం ఎన్‌ఏడీ జిడబ్ల్యూ విభాగం కార్మికులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థను అడ్డుకున్న కార్మికులపై కక్ష సాధించేందుకు యాజమాన్యం టార్గెట్ విధించిందన్నారు. ఆ టార్గెట్‌ను పూర్తి చేసి కార్మికుల శక్తిని యాజమాన్యానికి నిరూపించారని అభినందించారు. ఎన్ఏసీఎస్ అండ్ డబ్ల్యూ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ జిడబ్ల్యూ డివిజన్ కార్మికులు కృషి మరువలేనిదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెటట్టేందుకు యత్నిస్తే ఐక్య ఉద్యమాల ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంకల్ప బలం ముందు ఏ శక్తి నిలవలేదన్నారు. మన సంస్థను మనం కాపాడుకునేందుకు ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగభూషణం, కొండబాబు, పి. రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాపత్తు ఉత్సవాలు


పరమపదవాసుడి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై పదిరోజులుగా నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజు వరాహ లక్ష్మీనృసింహ స్వామి పరమపదవాసుడిగా దర్శనమిచ్చాడు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా ముస్తాబు చేసి పల్లకిలో అధిష్టంపజేశారు. మరో పల్లకిలో ఆళ్వారులను వేంచేయజేసి సింహగిరి మాడ వీధుల్లో రాత్రి తిరువీధి నిర్వహించారు. అనంతరం స్వామిని ఆస్థానమండపంలో అధిష్టంపజేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన


పినగాడిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ అశోక్‌కుమార్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని మహిళలకు వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ సూచించారు. పెందుర్తి మండలం పినగాడిలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం సాగించవచ్చన్నారు. చిన్నపొరపాటు ఎంతో అనర్థాన్ని తెచ్చిపెడుతుందన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ చ్చితంగా ధరించాలని.. కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవ్ చేయడం, సిగ్నల్ క్రాసింగ్, ఓవర్‌స్పీడ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా మహిళలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన నిర్వాసితుల నిరాహార దీక్ష

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్ల నుంచి ఆందోళనే కార్యక్రమాలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం అన్యాయమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ, నిర్వాసితుల ఐక్య పోరాట కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి కూడలిలో చేపట్టిన 36 గంటల నిరవధిక నిరాహార దీక్షల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు, సెయిల్, ఎన్ఎండీసీలను విలీనం చేస్తే ప్రపంచానికి కావాల్సిన ఉక్కును భారతదేశమే ఎగుమతి చేయగలదన్నారు. నిర్వాసితుల భూములతో వ్యాపారం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. నిర్వాసితులకు న్యాయం జరగడానికి అవసరమైతే ఆమరణ దీక్షకు కూడా సిద్ధమే అన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప, కె.సత్యనారాయణరావు, పెదిరెడ్ల నీలకంఠం, కరణం సత్యారావు, బొబ్బరి సూరి, గళ్ల రామకృష్ణ, ప్రసాద్, పితాన బాలకృష్ణ, స్థానిక నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా రమణబాబు, నెల్లి శ్రీనివాసరావు, కర్రి దశేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త

సీఐ రంగనాథం



సబ్బవరం: దొంగతనాలు నివారించడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్బవరం సీఐ రంగనాథం సూచించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రజలను అప్రమత్తం చేయడానికి బుధవారం ఆయన గ్రామాల్లో పర్యటించారు. దొంగతనాల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సంక్రాంతి సెలవులకు ఇల్లు విడిచిపెట్టి బయటకు వెళ్లేవారు బంగారం వంటి విలువైన అభరణాలు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచవద్దన్నారు. చిన్న పిల్లల ఒంటిపై విలువైన ఆభరణాలు వేసి ఒంటరిగా బయటకు పంపించకూడదన్నారు. ఇల్లు విడిచి పండగ సెలవులకు వెళ్లినపుడు పరిసర ప్రాంతాల వారికి, పోలీస్‌లకు సమాచారం అందించాలని కోరారు. మహిళలు విలువైన ఆభరణాలు ధరించి ఒంటరి ప్రదేశాలకు వెళ్లడం మంచిదికాదని సూచించారు. కొత్తవారికి ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు వారి ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇంటికి తాళం వేసి ఆ తాళాలు ఇంటి పరిసరాల్లో ఉంచకూడదన్నారు. మోటార్ సైకిళ్ల తాళాలు అరిగిపోతే కొత్తవి చేయించుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో పాసింజర్ వాహనాలలో ప్రయాణించేవారు మిత్రులకు సమాచారం అందించి వెళ్లడం మంచిదన్నారు. మోటార్ సైకిళ్లకు ఫోర్క్ లాక్ వేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనుమానిత వ్యక్తులు కనిపించినా.. తాళం వేసుకుని ఊరెళ్లినా కిందినంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ రంగనాథం కోరారు.

సబ్బవరం పోలీస్ స్టేషన్ -08924 248233
ఎస్ఐ వెంకటేశ్వరరావు-92913 14099
సీఐ రంగనాథం -94407 96089

దిశ యాప్‌తో ఆపద వేళ రక్షణ

గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: నేరాలు జరిగే సమయంలో విద్యార్థినులు, మహిళలు యుక్తితో వ్యవహరించాలని గాజువాక క్రైం సీఐ పి.సూర్యనారాయణ సూచించారు. గాజువాకలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదం ఎదురైనప్పుడు ఆందోళనకు గురికాకుండా యుక్తితో వ్యవహరించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి తమ ఫోన్లలో దిశయాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆపద సంభవించినా, ప్రాణహాని ఉందని గ్రహించినా ఆ యాప్ ద్వారా క్షణాల్లో పోలీసుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. ఇటీవల దిశయాప్ ద్వారా సురక్షితంగా బయటపడిన కొన్ని ఉదంతాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గాజువాక క్రైం ఎస్ఐ మహేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ శ్రీనివాసరావు, గాజువాక క్రైం హెచ్‌సీ వరహాలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

699వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కాలినడకన తిరుమల వెళ్లొచ్చిన కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 699వ రోజుకు చేరాయి. దీక్ష శిబిరంలో ఆర్‌ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్‌ఆర్ విభాగ కార్మికులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలంటూ కూర్మన్నపాలెం నుంచి తిరుపతికి కాలినడకన వెళ్లి మొక్కు తీర్చుకుని వచ్చిన ఉక్కు కార్మికులు నయనబాబు, గంటల రామారావును దీక్షా శిబిరం వద్ద ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, గుమ్మడి నరేంద్ర, డి. శ్రీనివాస్ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించేవరకు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో జి.జయ, జామినాయుడు, ఎన్.రమణ, బి.ఎన్.రాజు, ఎ.రాజేశ్వరరావు, రెడ్డి శ్రీనివాసరావు, వై.వి.రమణ, ఎన్నేటి రమణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

త్వరితగతిన గృహసారథుల నియామకం

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

సింహాచలం: ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పార్టీ బలోపేతానికి కీలకమైన గృహసారథుల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ, నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకురాలు వరుదు కల్యాణి సూచించారు. పెందుర్తి మండలం రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం అన్నపురెడ్డి అజయ్ రాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వలంటీర్ పరిధిలో ఇద్దరు చొప్పున గృహ సారథుల నియామకాన్ని తొందరగా చేపట్టాలని సూచించారు. వలంటీర్ వ్యవస్థ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందిస్తోందని, గృహ సారథుల నియామకం జరిగితే మరింతగా వాటిని అందించవచ్చని సూచించారు. పార్టీ ముఖ్యనేతలంతా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భగవాన్ జయరామ్, 94వవార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, చందు యాదవ్, నాయకులు చిప్పల చందు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెట్లమార్గాన్ని శుభ్రంగా తీర్చిదిద్దండి

ట్రస్ట్‌బోర్డు సభ్యుల సూచన


మెట్లమార్గాన్ని పరిశీలన చేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: ఈ నెల 16న కనుమ పండగరోజు కొండదిగువ పూలతోటలో జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహగి మెట్లమార్గాన్ని శుభ్రంగా తీర్చిదిద్దాలని సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. మకరవేట ఉత్సవం నేపథ్యంలో మెట్లమార్గాన్ని బుధవారం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవి వర్మ, సువ్వాడ శ్రీదేవి పరిశీలించారు. మెట్లమార్గంలో నాచు తొలగించడంతో పాటు శిథిలమైన మెట్లని ఆధునికీకరించాలని ఈఈ రాంబాబును ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మెట్లకు ఆనుకుని ఉన్న వరద నీటి కాలువకు మరమ్మతులు చేయాలన్నారు. సాగిధార, ఆకాశధారల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు.

ఘనంగా ముమ్మన పుట్టినరోజు


ముమ్మన దేముడుకు కేక్ తినిపిస్తున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పుట్టినరోజు వేడుకలు బుధవారం వార్డు పరిధి సుజాతానగర్‌లో అట్టహాసంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమాల సమక్షంలో ముమ్మన కేక్‌కట్ చేశారు. అనకాపల్లి ఎంపీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకర్గం ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ పాల్గొని ముమ్మనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజే శారు. వేద పండితులు, క్రైస్తవ, ముస్లిం మత బోధకులు ఆశీస్సులు అందజేశారు. అలాగే స్నేహమిత్ర హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆకార్ అనాథ బాలికల ఆశ్రమంలో పిల్లలకు దుప్పట్లు, స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధు రోమాల నూకరాజు, మురళి పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటేనే రాణింపు

ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా


వింటర్ వర్క్‌షాపును ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ జీజీఎం సిన్హా

పరవాడ: విద్యార్థులు తమ భవిష్యత్ ఉజ్వలంగా మార్చుకోవడానికి నైపుణ్యం పెంపొందించుకోవడానికి కృషి చేయాలని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. దీపాంజలినగర్‌లోని బాల భారతి పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన శీతాకాలపు వర్క్‌షాపును సంస్థ జీజీఎం సిన్హా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో తమ నైపుణ్యం పెంపొందించుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి, కెరీర్ ఎంపికలో మార్గ నిర్దేశం చేయడం సంస్థ లక్ష్యంగా పెట్టుకొందన్నారు. భవిష్యత్‌లో మంచి విజయవకాశాలు సాధించాలని జీజీఎం సిన్హా ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హా విద్యార్థులకు యోగా మ్యాట్‌లు, స్టేషనరీ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు, సీఎస్సార్ అధికారులు, దీపిక లేడీస్ క్లబ్ సభ్యుల బృందం, బాల భారతి పబ్లిక్ స్కూల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మేలుకొలుపు


పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలోపరవాడ, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, రావాడ, లంకెలపాలెం, వెన్నలపాలెం గ్రామాల్లోరామాలయాల కేంద్రంగా భక్తులు మేలు కొలుపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం భగవంతుని నామం పలుకుతూ గ్రామాల్లో ర్యాలీలు చేపడుతున్నారు. ఆధ్యాత్మిక భావం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని పంచాయతీల కేంద్రంగా నిర్వహించాలని మండల ధార్మిక కమిటీ తెలిపింది. కార్యక్రమంలో సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, నాయుడుపాలెం సర్పంచ్ కె.వరలక్ష్మి సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, కమిటీ సభ్యులు ఎం.నాగపేర్రాజు, వి.అప్పలరాజు, సీహెచ్.అప్పారావు, కె.శ్రీనివాసరావు, దుంగల అప్పారావు, బి.బాబూరావు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ దొంగలు అరెస్ట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని క్వార్టర్స్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన ఇద్దరు దొంగలను స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉక్కునగరంలోని రెండు క్వార్టర్స్‌లో వరుసగా జరిగిన దొంగతనాల్లో రెండు ల్యాప్‌టాప్‌లతో పాటు కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీ అయ్యాయి. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసుల విచారణలో లభించిన ఆధారాల మేరకు అచ్యుతాపురం మండలం దోసూరుకు చెందిన కొల్లి రాజునాయుడు (20), పరవాడ మండలం తానాంకు చెందిన బత్తి నిషాంత్‌లను అరెస్ట్ చేశారు.